క్లుప్తంగా

గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు ఆసక్తి గల విద్యార్థినులు నేరుగా కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చని కళాశాల ప్రిన్సిపల్ చంద్రిక శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీ ,ఎంఎస్ టీసీఎస్ , బీజెడ్‌సీ ,ఎంజెడ్‌సీ) బీకాం (సీఏ,బీఏ,) బీఏ(హెచ్ ఈపీ) కోర్సులలో ఎస్సీ కేటగిరిలో సీట్లు ఉన్నాయన్నారు. వివరాల కోసం ఈ ఫోన్ నంబర్లను 98665 86887, 99596 31207 సంప్రదించాలన్నారు.

ఎల్‌వోసీ అందజేత



మోర్తాడ్ : భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్‌కు చెందిన ఎంపల్లి లక్ష్మి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మెరుగైన వైద్యం కోసం రూ.1.50లక్షల ఎల్‌వోసీని బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ కమ్యూనిస్టు అగ్ర నేత డీవీకే



బోధన్/కమ్మర్‌పల్లి : ఆదర్శ కమ్యూనిస్టు అగ్ర నేత డీవీకే (దుర్గంపూడి కృష్ణారెడ్డి) అని అఖిల భారత ఐక్య రైతు వేదిక (ఏఐయూకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ అన్నారు. డీవీకే మూడో వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఎడపల్లి, కమ్మర్‌పల్లి మండల కేంద్రాల్లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఏఐయూకేఎస్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు ఉన్నారు.

మొక్కలకు జీవామృతం అందించాలి



బాల్కొండ: నర్సరీలో పెంచుతున్న మొక్కలకు జీవామృతం అందించాలని బాల్కొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి రణవీర్ అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్రంలో నర్సరీని పరిశీలించారు. నర్సరీల్లో కలుపు మొక్కలు లేకుండా చూడాలన్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తమొక్కలను పెంచాలన్నారు. ఆయన వెంట సెక్షన్ అధికారి గణేష్, జీపీ కార్యదర్శి మల్లేశ్ తదితరులున్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సయ్యద్ రేహాన్ ఇటీవల విద్యుదాఘాతంతో గాయాల పాలయ్యాడు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆల్ ఇండియా క్వామి తంజీమ్ నిజామాబాద్ జోనల్ అధ్యక్షుడు సుమీర్ అహ్మద్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడంతో ఈ సంఘటన జరిగినట్లు ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డికి ఫిర్యాదు చేశారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి



ఇందల్వాయి: మండలంలోని మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని సెర్ప్ ఐబీ డైరెక్టర్ భారతి అన్నారు. ఇందల్వాయి రైతు వేదికలో మహిళా సంఘాల సభ్యులతో ఆమె శుక్రవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.నూతనంగా ఎన్నికైన మహిళా సంఘాల పదాతిపతులు సంఘంలోని సభ్యులందరికీ రుణాలు అందేలా వారు రుణాన్ని సకాలంలో చెల్లించేలా కృషి చేయాలని సూచించారు.కామారెడ్డి జిల్లా నుంచి వచ్చిన సీఆర్పీలు మహిళా సంఘాల అధ్యక్షులకు ఆర్థిక పద్దుల నిర్వహణ సభ్యులతో సమన్వయం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.

వసతుల్లేని బస్టాండ్



నీటితో నిండిన బస్టాండ్ ఆవరణ



రుద్రూర్ బస్టాండ్‌లో శిథిలావస్థకు చేరిన టాయ్‌లెట్స్

- రుద్రూర్‌లో చిన్నవానకే బురదమయమవుతున్న ఆవరణ
- శిథిలావస్థకు చేరిన టాయ్‌లెట్స్
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

రుద్రూర్: మండలకేంద్రమైన రుద్రూర్ బస్టాండ్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 25 ఏళ్ల క్రితం ఈ బస్టాండ్ నిర్మించారు. ప్రస్తుతం బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాల గదులు శిథిలావస్థకు చేరాయి. టాయ్‌లెట్స్ సౌకర్యం లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ బస్టాండ్ ద్వారా ప్రతి రోజు బోధన్, జహీరాబాద్, సంగారెడ్డి డిపోలకు చెందిన బస్సులు వెళ్తుంటాయి. వర్ని వైపు నుంచి వచ్చే ప్రయాణికులు కోటగిరి, పోతంగల్ మండలాలకు వెళ్లడానికి ఇక్కడే బస్సు మారుతారు. ప్రతిరోజు వందల సంఖ్యలో ఇక్కడి నుంచి ప్రయాణం చేస్తుంటారు. బస్టాండ్‌లో సరిపడు బెంచీలు లేకపోవడంతో సమీపంలోని దుకాణాల వద్ద బస్సు కోసం వేచి ఉండాల్సి వస్తోంది. వర్షం కురిస్తే బస్టాండ్ ఆవరణ బురదమయంగా మారుతోంది. గుంతల్లో వర్షపు నీరు నిండి బస్సు ఎక్కడానికి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న షాపుల ద్వారా ఆర్టీసీకి ఆదాయం సమకూరుతున్నప్పటికి సౌకర్యాలు కల్పించడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదని ప్రయాణికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



బస్టాండ్‌లో మూత్రశాలగదులు శిథిలావస్థకు చేరి ఏళ్లు గడుస్తున్నాయి. కంట్రోలర్, ఆర్టీసీ అధికారులకు చాలా సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. జహీరాబాద్, సంగారెడ్డి నుంచి వచ్చిన వారు కోటగిరి, పోతంగల్ వెళ్లడానికి ఇక్కడే దిగుతారు. బస్టాండ్‌లో మూత్రశాలలు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

– కౌలస్ గంగాధర్, స్వచ్ఛంద సంస్థ రైట్స్ సభ్యుడు,రుద్రూర్

గుంతలు పూడ్చాలి



వాన పడితే బస్టాండ్ ఆవరణ బురదమయంగా మారిపోతోంది. గుంతలు నీళ్లతో నిండిపోవడంతో బురద నీటిలో నిలబడి బస్సు ఎక్కాల్సి వస్తోంది. వెంటనే గుంతలు పూడ్చి బస్టాండ్‌లో కనీస సౌకరాలు కల్పించాలి.

– గాండ్ల శ్రీనివాస్, రుద్రూర్

నేటి చిత్రం

మురికి కాలువను నిర్మించండి..



మోర్తాడ్: మోర్తాడ్ గ్రామం నుంచి బస్టాండ్ వెళ్లే మార్గంలో మురికి కాలువ లేకపోవడంతో మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. దోమల బెడద పెరిగి ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. మురికి నీరు రోడ్డుపై ప్రవహించకుండా కాలువ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– రొయ్యల అంజు, మోర్తాడ్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

ప్రభుత్వ ఆస్తులను రక్షించాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి
- నందిపేటలో అధికారులతో రివ్యూ

నందిపేట్(ఆర్మూర్): ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో రివ్యూ సమావేశంలో అధికారుల పనితీరును తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వనమహోత్సవం, చెరువులపై సమీక్ష జరిపారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను అధికారులదే అన్నారు. అటవీభూముల నుంచి మొరం తవ్వకుండా రెవెన్యూ అధికారులతో కలిసి అటవీభూములను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు మండలంలోని ఖద్యాన్‌పూర్ గ్రామంలో బీసీ హస్టల్ నూతన భవన నిర్మాణం కోసం ఐదు ఎకరాల అనువైన స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. స్థలం గుర్తించిన అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపాలని ఆదేశించారు.

అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వాలి:

మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనర్హులకు ఇళ్లు కేటాయించారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అర్హులకు ఇళ్లు ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమాలలో ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

పెర్కిట్(ఆర్మూర్): ఇందిరమ్మ గాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గుర్తు చేశారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ఎమర్జెన్సీ సమయంలో జైలు పాలైన నియోజకవర్గానికి చెందిన పుప్పాల రాజేందర్, బూసాని గోవర్ధన్, పోల్కం రవినాథ్, సిలివేరి శ్రీధర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు పెద్దోళ్ల గంగా రెడ్డి, లోక భూపతి రెడ్డి, కలిగోట గంగాధర్, బింగి పెంటయ్య, పోల్కం వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కలిసిన న్యాయవాదులు



బోధన్: హైదరాబాద్‌లోని స్వగృహంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని శుక్రవారం బోధన్ న్యాయవాదుల హౌజింగ్ కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి తమ సమస్యలను విన్నవించారు.సుదీర్ఘకాలంగా తాము కోరుకుంటున్న ఇళ్ల స్థలాల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని న్యాయవాదులు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాములు, హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి,ప్రతినిధులు, న్యాయవాదులున్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

నవీపేట : ఆంగ్ల భాష శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండలంలోని శివతండా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు శివకుమార్‌ను డీఈవో అశోక్ శుక్రవారం సన్మానించారు. బెంగళూరులోని దక్షిణ భారతదేశ ప్రాంతీయ ఆంగ్ల భాష శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో పదిమంది ఉపాధ్యాయులు ఏ ప్లస్ గ్రేడ్ సాధించారు.ఇందులో జిల్లా నుంచి శివకుమార్ ఎంపికకావడంతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో సన్మానించారు. పీఆర్‌టీయూ నేతలున్నారు.

అధ్యాత్మికం

■ ఘనంగా గంగపుత్రుల బోనాలు



ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

బోదన్‌టౌన్(బోధన్): గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా గ్రామ దేవతలైన మహలక్ష్మీ, నల్లపోచమ్మ,పెద్దమ్మ తల్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని, పిల్లపాప ఆరోగ్యంగా ఉండాలని అమ్మవార్లను కోరుకున్నారు. సంఘం అధ్యక్షులు కోట అబ్బయ్య, ప్రధన కార్యదర్శి గంగాధర్, పెద్దలు సుల్తాన్ సాయిలు, నడిపి లక్ష్మయ్య, వెండి బిలయ్య, దాల్ మల్క సాయిలు, తదితరులున్నారు.

■ వైభవంగా సీతారామచంద్ర స్వామి మండల పూజ

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ మండల పూజ శుక్రవారం వైభవంగా జరిగింది. విగ్రహా ప్రతిష్ఠాపన చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా యజ్ఞం నిర్వహించారు. అనంతరం శ్రీ కేదారీశ్వరఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్‌కు పాదపూజ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



పూజలో పాల్గొన్న మంగిరాములు మహరాజ్

సమ్మె నోటీస్ అందజేత



రుద్రూర్‌లో సమ్మె నోటీస్ అందిస్తున్న ఆశావర్కర్లు

రుద్రూర్/బోధన్‌టౌన్ : కేంద్ర కార్మిక సంఘాలు జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొననున్నట్లు ఆశా కార్యకర్తలు శుక్రవారం మండల వైద్యాధికారిణి ఆయేషా సిద్ధిఖాకు సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నే సాబ్, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు భూలక్ష్మి, వాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ లత, నాయకులు శోభ, లక్ష్మి, ప్రేమల, ఇందిరా తదితరులు పాల్గొన్నారు. అలాగే బోధన్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ రమేష్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గణేష్‌లకు సమ్మె నోటీసును అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ నాయకులు బి. మల్లేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా జులై 9వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం ప్రజా సంఘాలతో నిర్వహించిన విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు.సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మోర్తాడ్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండటానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ సూచించారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా పలువార్డులలో పర్యటించిన ఆయన నీటి నిలువ ద్వారా జరిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించారు. నీటిని నిలువ చేసుకోవడం వల్ల దోమల బెడద పెరిగి డెంగ్యూ, ఫైలేరియా, మలేరియా ఇతరత్రా జ్వరాలు వస్తాయని హెచ్చరించారు. దోమల నివారణ కోసం తాము చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రతి శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో డ్రైడే నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్

వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి

బాల్కొండ: వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని బాల్కొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయి అన్నారు. శుక్రవారం బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, హెల్త్ సిబ్బందికి, ఆశావర్కర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్‌రమేశ్, ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రెడ్డి, వైద్యాధికారి ప్రవంతి, ఎంపీవో గంగామోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి..

విద్యార్థులు అన్నం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని మెండోరా మండలం పోచంపాడ్‌ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాకేశ్ అన్నారు. శుక్రవారం స్థానిక తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, వైద్యా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్మూర్‌లో శ్రీ జగన్నాథ రథయాత్ర

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆర్మూర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో శనివారం శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ సభ్యులు శుక్రవారం తెలిపారు. అనంతరం అన్నప్రసాదం కార్యక్రమం ఉంటుందని ఇస్కాన్ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలన్నారు.

30న బోధన్‌లో తొలిసారి రథయాత్ర..

బోధన్: పూరి జగన్నాథ రథయాత్ర తరహాలో ఇస్కాన్ భక్తి కేంద్రం ఆధ్వర్యంలో పట్టణకేంద్రంలో తొలి సారిగా ఈనెల 30న శ్రీ జగన్నాథుడి రథయాత్ర నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం స్థానిక ఇస్కాన్ భక్తి కేంద్రంలో ప్రతినిధులు, నిర్వాహకులు రథయాత్రకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడి, భగవద్దర్శన్ తెలుగు మాసపత్రిక సహాయ సంపాదకులు డాక్టర్ వైష్ణవాంఘ్రి సేవక్‌దాస్ హాజరుకానున్నారని తెలిపారు. రథయాత్రలో సుమారు 10 వేల మంది భక్తజనం పాల్గొనున్నారని పేర్కొన్నారు. ఇస్కాన్ ప్రతినిధులు అశోకాత్మ నితాయ్ దాస్, కేశవ కరుణానిధి దాస్, యాదవపతి గోవింద్‌దాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఇస్కాన్ ప్రతినిధులు

కొనసాగుతున్న 100 రోజుల ప్రణాళిక

ఆర్మూర్‌టౌన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 13వ, 23వ వార్డులో పారిశుధ్య కార్యక్రమంతో పాటు ఘన వ్యర్థాపదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నిలువ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అనంతరం కాలనీలో తిరుగుతూ నిలువ ఉన్న నీరును తొలగించి దోమల నివారణ మందు పిచికారి చేయించారు. కార్యాక్రమంలో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కుండిలో నీటిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సెల్‌ఫోన్‌ల అందజేత



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లను బాధితులకు సీఐ వెంకట నారాయణ శుక్రవారం అందజేశారు. పొగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను ఈసీఐఆర్ పోర్టల్ ద్వారా రికవరి చేసి బాధితులకు అందించామని సీఐ తెలిపారు.

ఆయిల్‌పాం సాగుకు సబ్సిడీలు

నందిపేట్(ఆర్మూర్): ఆయిల్ పాం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు రకాల సబ్సిడీలను అందజేస్తుందని ఆర్మూర్ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి రాజు అన్నారు. నందిపేట మండలంలోని వన్నెల్ కే గ్రామంలో ఆయిల్ ఫాం గెలల కోత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రైతులతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీయూనిక్ కంపెనీ ఏరియా జనరల్ మేనేజర్ సాయికిరణ్ మాట్లాడుతూ ఆయిల్ ఫాం పంటను ఒక్కసారి నాటితే 4 సంవత్సరాల తర్వాత నిరంతరం ఆదాయాన్ని 30 సంవత్సరాల వరకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రీ యూనిక్ కంపెనీ జోనల్ మేనేజర్ రోహిత్, క్లస్టర్ ప్రతినిధి నిఖిల్ , పీఏసీఎస్ చైర్మన్ కార్తిక్‌రెడ్డి, మాజీ సర్పంచు కృష్ణ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఆయిల్ పాం గెలల కోతను పరిశీలిస్తున్న రైతులు

సంక్షిప్తం

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

వర్ని: మండలంలోని కూనీపూర్ గ్రామంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యను అభ్యసించే విద్యార్థులకు మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. జీపీ కార్మికులకు నిత్యవసర సరుకులను అందజేశారు. ట్రస్ట్ మేనేజర్ ఠాగూర్, పీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజిరెడ్డి, భారత్ గ్యాస్ నరసయ్య, జాకోరా సొసైటీ మాజీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి పంచాయతీ కార్యదర్శి సౌజన్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు టై, బెల్టులు ..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. రోటరి అధ్యక్షుడు రజనిష్ కిరాడ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి రాస ఆనంద్, పుష్కార్ రావు, గంగా మోహన్ చక్రు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంతోషి రాణి, ఉపాధ్యాయులు రాజు, సదియా, రజిని, లక్ష్మీ నారాయణ, దత్తాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

అమిత్‌షా కార్యక్రమానికి తరలిరావాలి

వేల్పూర్: జిల్లా కేంద్రంలో ఈనెల 29న పసుపుబోర్డు కార్యాలయం ప్రారంభోత్సవానికి వస్తున్న కేంద్రహోం మంత్రి అమిత్‌షా కార్యక్రమానికి తరలి రావాలని మండల బీజేపీ అధ్యక్షుడు బేల్గారి నవీన్ కోరారు. మండలంలోని మోతె గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నాయకులు భానుచందర్, లింగన్న, ప్రవీణ్, నర్సింగ్, దొల్ల రమేశ్, ఏలేటి రాజేశ్వర్ తదితరులు న్నారు.

జీపీ యూనియన్ నాయకుల ముందస్తు అరెస్టు

రుద్రూర్ /వర్ని : రుద్రూర్, మోస్రా, చందూర్ మండలాల గ్రామ పంచాయతీవర్కర్స్ యూనియన్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలనే డిమాండ్లతో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టారు. దీంతో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు యూనియన్ నాయకులు శ్రీకాంత్, సాయరెడ్డి, శ్రావణ్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకుని రుద్రూర్, వర్ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పరిశీలన

వర్ని (మోస్రా): మోస్రా మండలంలోని గోవూరు గ్రామంలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే స్థలాలను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు.ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులకు సూచనలు సలహాలు ఇస్తూ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గాను శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు మంద మహిపాల్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. నాయకులు సిలిండర్ లింగం, మాన్పూర్ భూమేష్, కిష్టగౌడ్, మన్నె సాగర్, తమ్మల దేవెందర్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.